తెలంగాణ ప్రభుత్వం

# పౌరసరఫరాల శాఖ కార్యాలయం

సోమాజిగూడ, హైదరాబాద్ 500082

పత్రిక ప్రకటన : తేదీ : 04-01-2019

## ఐరిస్‌తోనూ రేషన్ సరుకులు

## 16 జిల్లాల్లో 5186 షాపుల్లో ప్రారంభం

## నాలుగు రోజుల్లో 15.20 లక్షల మందికి సరుకుల పంపిణీ

## సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఐరిస్ విధానాన్ని పరిశీలించిన కమిషనర్ అకున్ సబర్వాల్

ప్రజాపంపిణీ ద్వారా రేషన్ సరుకులు తీసుకోవడానికి లబ్ధిదారులకు మరింత సులువుగా, మరింత ప్రయోజనం కలిగించేలా తెలంగాణ పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వేలిముద్రలతోపాటు కనుపాపల (ఐరిస్) ఆధారంగా లబ్ధిదారులకు సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నెల ఒకటవ తేదీ నుండి మొదటి విడతలో 16 జిల్లాల్లోని 5186 ప్రారంభించింది.

దాదాపు ఏడాది నుంచి పౌరసరఫరాల శాఖ ఈపాస్ (బయోమెట్రిక్) విధానం ద్వారా సరుకుల పంపిణీ చేస్తోంది. అయితే ఈ విధానంలో కొంతమందిలో ముఖ్యంగా వృద్ధులు, మహిళల వేలిముద్రలు అరిగిపోవడం వల్ల ఈపాస్ మెషీన్‌లు ధృవీకరించడం లేదు. దీంతో ప్రతినెల రేషన్ సరుకులు తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులు అసౌకర్యానికి గురికావద్దనే ఉద్దేశంతో వేలిముద్రలు సరిపడని చోట ఆయా ప్రాంతాల్లో విఆర్‌వో, విఏవో, పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్లకు అథంటికేషన్ సౌకర్యం కల్పించింది. అయితే ఈ విధానం అక్కడక్కడ కొన్ని చోట్ల దుర్వినియోగమవుతున్న విషయం పౌరసరఫరాల అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ఈ సమస్యలను అధిగమించడానికి ఐరిస్ విధానం పరిష్కారమని భావించిన పౌరసరఫరాల శాఖ అధికారులు రాష్ట్రంలోని 17200 రేషన్ షాపుల్లో దశల వారీగా ఐరిస్ విధానం అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ నెల ఒకటవ తేదీ నుండి మొదటి విడతలో 16 జిల్లాల్లోని 5186 షాపుల్లో ఐరిస్ విధానాన్ని ప్రారంభించింది.

శుక్రవారం నాడు సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలోని రేషన్ షాపుల్లో ఐరిస్ విధానం అమలు తీరును పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ త్వరలో అన్ని షాపుల్లో ఈ విధానాన్ని అమల్లోకి తెస్తామని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా, అర్హులైన పేదలకు మరింత సులువుగా నిత్యావసర సరుకులు అందించడానికి ఐరిస్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

మొదటి విడతలో ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, కొత్తగూడెం, గద్వాల్, నిర్మల్, భువనగిరి, మంచిర్యాల, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని 8635 షాపులకు గాను 5186 షాపుల్లో ఈ నెల ఒకటవ తేదీ నుండి ఐరిస్ విధానాన్ని అమల్లోకి తీసుకు రావడం జరిగింది. ఈ నాలుగు రోజుల్లో 15.20 లక్షల మంది రేషన్ సరుకులు తీసుకున్నారని తెలిపారు.

**నోట్:** సిరిసిల్ల జిల్లాలో ఐరిస్ ద్వారా రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు.

శుక్రవారంనాడు సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలో ఐరిస్ విధానం అమలు తీరును పరిశీలిస్తున్న కమీషనర్ అకున్ సబర్వాల్.

---

పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి జారీచేయబడినది.